## మిత్రుడి వైద్య ఖర్చులకు స్నేహితుల చేయూత

దండేపల్లి సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి గ్రామానికి చెందిన ఎస్‌కే వహీద్‌కి గత కొంత కాలంగా కిడ్నీ లీవర్ సంబంధింత వ్యాధితో తీవ్రంగా బాధపడుతున్నాడు. దీంతో అతనితో దండేపల్లిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల లోని 2005-06 సంవత్సరంలో పదో తరగతి చదివిన బాల్య మిత్రులందరు కలిసి రూ. 33,500 పోగు చేసి బాల్య మిత్రుడి వహీద్ వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందజేశారు. మంగళవారం బాల్య మిత్రుడి ఇంటికి వెళ్లి ఈ నగదును అందజేసి బాల్యమిత్రులు అండగా నిలిచారు. కార్యక్రమంలో ముత్యాల రాధకృష్ణ, గాండ్ల అశోక్ కుమార్, అల్లం రాజశేఖర్, గడికందుల సురేష్‌లు ఉన్నారు.

## విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి

జన్నారం, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని బతుకమ్మ కేంద్రాల వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం ఎంపీడీవో ఉమర్ షరీఫ్‌కు సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు జాడి గంగాధర్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని గ్రామ పంచాయతీల్లో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ దీపాలంకరణకు విద్యుత్ దీపాలు, గ్రామ పంచాయతీల ద్వారా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. మహిళలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు మరింత సమయం




- ప్రత్యేకాధికారుల పాలనలో నడుస్తున్న బల్దియాలు
- పంచాయతీ ఎన్నికలు ముగిస్తేనే మార్గం సుగమం
- కార్పొరేషన్ ఎన్నికలు ఇక వచ్చే ఏడాదే

మంచిర్యాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు మరి కొంత సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీకాలం ఈ ఏడాది జనవరి 26వ తేదీతో ముగిసింది. ఎనిమిది నెలలు గడుస్తున్నా మున్సిపల్ ఎన్నికలకు మోక్షం కలగకపోగా, మరింతగా ఆలస్యమయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీంతో మున్సిపాలిటీలు ప్రత్యేకాధికారుల పాలనలో పని చేస్తున్నాయి. ఇదిలా ఉండగా పరిషత్, పంచాయతీ ఎన్నికలు ముగిసిన తరువాతనే మున్సిపల్ ఎలక్షన్లు నిర్వ హించనున్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు పెండింగులో ఉండటంతో పరిషత్, పంచాయతీ ఎన్నికల నిర్వణలో జాప్యం జరుగుతోంది. దీంతో ఆ ఎన్నికలు ఆలస్యం అ య్యే అవకాశాలు ఉండగా, వాటి తరువాతనే మున్సి పల్ పాలక వర్గాలు కొలువుదీరనున్నాయి.

### గడువుకు ముందే ముగిసిన పదవీకాలం..

జిల్లాలో మంచిర్యాల (ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్), నస్పూర్, చెన్నూర్, లక్షెట్టిపేట, మందమర్రి, క్యాతనపల్లి, బెల్లంపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. మందమర్రి మున్సిపాలిటీ 1/70 ఏజెన్సీ చట్టం పరిధిలో ఉండటంతో అక్కడ దశాబ్దాలుగా ఎన్నికలు నిర్వహించడంలేదు. దీంతో అధికారుల పాలనలోనే మున్సిపాలిటీ నడుస్తోంది. బల్దియాలకు చివరిసారిగా 2020లో ఎన్నికలు జరిగాయి. వాస్తవానికి మున్సిపల్ పాలక వర్గాల పదవీకాలం ఐదేళ్లపాటు ఉంటుంది. అందుకు భిన్నంగా నస్పూర్, మంచిర్యాల మున్సిపాలిటీలలో పాలక వర్గాల పదవీకాలం ఊహించని విధంగా నాలుగేళ్లకే ముగిసింది. మంచిర్యాల నియోజకవర్గంలో కిందటి సంవత్సరం రాజకీయాలు ఒక్కసారిగా మలుపు తిరిగాయి. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యేగా కొక్కిరాల ప్రేంసాగర్‌రావు భారీ మెజార్టీతో గెలుపొందారు.

దీంతో ఆయన నియోజకవర్గంలోని మున్సిపాలిటీలపై దృష్టిసారించారు. అప్పటిదాకా బీఆర్ఎస్ పాలక వర్గాలు ఉండగా, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సభ్యులంతా అధికార పార్టీలోకి వెళ్లారు. దీంతో నియోజకవర్గంలోని నస్పూర్, మంచిర్యాల, లక్షెట్టిపేట మున్సిపాలిటీలను కాంగ్రెస్ ఖాతాలో వేసుకునేందుకు అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టారు.అనుకున్న విధంగానే మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీలు కాంగ్రెస్ కైవసం కాగా అప్పటి వరకు బీఆర్ఎస్ చైర్మ న్లుగా కొనసాగిన పెంట రాజయ్య, ఈసంపెల్లి ప్రభా కర్‌లు బలని రూపణలో వెనుకబడటంతో నాలుగేళ్లకే పదవిచ్యుతులు అయ్యారు. వీరు నిర్ణీత గడువుకు ఏడాది ముందే అనూహ్యంగా పదవులు కోల్పోవలసి వచ్చింది. వారి స్థానంలో రావుల ఉప్పలయ్య (మంచిర్యాల), సురిమిల్ల వేణు (నస్పూర్) చైర్మన్లుగా బాధ్యతలు స్వీకరించారు. అలాగే వైస్ చైర్మన్లుగా కొనసాగిన గాజుల ముకేష్‌గౌడ్ (మంచిర్యాల), తోట శ్రీనివాస్ (నస్పూర్)ల స్థానంలో సల్ల మహేష్ (మంచిర్యాల), గెల్లు రజిత (నస్పూర్)లు పదవీ బాధ్యతలు చేపట్టారు. అవిశ్వాస తీర్మాణాల కారణంగా మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు నాలుగేళ్లకే పదవుల్లో నుంచి తప్పుకోవలసి రాగా, కొత్తగా..

(తరువాయి 7లో)

## ఉషూ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో పీఈటీలు, నిర్వాహకులు

నస్పూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పట్టణంలోని సాధన గ్రీన్ కిడ్స్ పాఠశాల ఆవరణలో మంగళవారం జిల్లా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17, అండర్-19 ఉషూ బాలబాలికల ఎంపిక పోటీలు జరిగాయి. పోటీలకు ఉమ్మడి నుంచి దాదాపు 70 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో ప్రతిభ కనబర్చి ఎంపికైనా క్రీడాకారులు ఈ నెల 25 నుంచి 27 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని నిర్వహకులు తెలిపారు. ఎంపికైన బాలుర విభాగంలో అండర్-19లో ఆదిత్య, అండర్-17లో కృష్ణ, యశ్వంత్, యువరాజ్, రాంచరణ్, అరవింద్, యువరాజ్, ఆదర్శ్ కుమార్‌లున్నారు. బాలికల విభాగంలో అండర్-19లో లలిత, చందన, అండర్ -17లో రాజేశ్వరి, మహిత, రుచిత, మన్నీ, అన్విత, రక్షిత, హర్షిత, కరిష్మాలు ఎంపికైనట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సాధన గ్రూప్స్ డైరెక్టర్ పెంచాల శ్రీధర్, అండర్-19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బాబు రావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు యాకూబ్, వెంకటేశ్, నిర్వహకులు శివ మహేష్, వ్యాయామ ఉపాధ్యాయులు సుధీర్, రాజేందర్, దేవయ్య, సాయికృష్ణ, కోచ్‌లు మాస్టర్స్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న అల్లం అనిత

దండేపల్లి సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా మహిళ సమైఖ్య అధ్యక్షురాలు అల్లంల అనిత అన్నారు. దండేపల్లిలో శ్రీలక్ష్మి మండల సమైఖ్య ఐకేపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల సమైఖ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న సంకల్పనతో స్వయం సహాయక సంఘాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల కోసం అనేక పథకాలను అమలు చేస్తుందని, వీటిని మహిళలు సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. స్వశక్తి సంఘాల్లో కొత్త సభ్యులను చేర్పించాలన్నారు. దీనికి గ్రామైఖ్య సంఘాల వివో, సభ్యులు కృషి చేయాలన్నారు. ఇప్పటి వరకు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మండల మహిళ సమైఖ్య కార్యదర్శు రజిత, ఐకేపీ ఏపీఎం తోట లక్ష్మి, సీసీలు లావణ్య, సురేందర్, తిరుపతిగౌడ్, జనార్ధన్, అశోక్, కోమరెల్లి, శ్రీనివాస్, మండల సమైఖ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## నిరుద్యోగుల కోసమే మెగా జాబ్‌మేళా

మందమర్రిటౌన్,సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసమే మెగా జాబ్ మేళా అని కార్మెల్ డిగ్రీ కాలేజ్ డైరెక్టర్ ఫాదర్ జీబీఆర్‌రెక్స్ తెలిపారు. మంగళవారం స్థానిక కార్మెల్ డిగ్రీ కళాశాలలో ఆదిలాబాద్ కథోలిక మెత్రాసన డాన్‌బాస్కో వారి ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్య పూర్తి చేసుకున్నటువంటి విద్యార్థులకు ఉద్యోగ అన్వేషన చేస్తున్న వారికి ఈ పోటీ ప్రపంచంలో తట్టుకోవడానికి సిద్ధంగా ఉండాలని, ఈ జాబ్ మేళాకు ప్రతి ఒక్కరు హాజరవడంతో వారికి అనువైన ఉపాధి అవకాశాలు ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. తాము ఒక సామాజిక బాధ్యతతో ఈ మేళా నిర్వహించామన్నారు. ఈ జాబ్‌మేళాకు 400 మంది హాజరుకాగా 210 మంది ఎంపికయ్యారని, ఆయా సంస్థలకు సంబంధించి 60 మందికి నియామక పత్రాలు అంద జేశారు. ఈ జాబ్‌మేళాకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన 22 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ పీటంయూత్ డైరెక్టర్ ఫాదర్ జిజో, ఫాదర్ జస్టిన్‌లు, పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పాలనలో ఎనిమిది లక్షల కోట్ల అప్పు

- కేసీఆర్ రాచరిక పాలనతో రాజ్యమేలారు
- ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వం

మందమర్రిటౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో 8 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిన మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి ధ్వజమెత్తారు. చేసిన అప్పులకు 5 వేల కోట్ల వడ్డీని తమ ప్రభుత్వం చెల్లిస్తుందని, రాష్ట్రంలో ఖజానా ఖాళీగా ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నార్నారు. మంగళవారం మందమర్రిలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమాన్నివిస్మరించి కుటుంబ ప్రయోజనాలకు పెద్దపీట వేశారని, కుంభకోణాలకు పాల్పడిన ఘనత కేసీఆర్‌దేనని తెలిపారు. రాష్ట్రంలో సన్న బియ్యాన్ని అర్హులైన వారికి పంపిణీ చేస్తున్నామన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క ఇల్లు, రేషన్ కార్డు ఇవ్వలేదని తెలిపారు. తన నియోజకవర్గంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేశామని, నూతన రేషన్‌కార్డులను పెద్ద సంఖ్యలో పంపిణీ చే శామన్నారు. అంతే కాకుండా కాళేశ్వరం ప్రాజెక్టు వేస్ట్ ప్రాజెక్టు అని తెలిపారు. తుమ్మిడి హెట్టి వద్ద ప్రాజెక్టు చేపడితే జిల్లా సస్యశ్యామలం అ య్యేదని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి సొంత నిర్మాణాలతో కట్టిన కాళేశ్వరం కుప్పకూలిపోయిందన్నారు. ఈ ప్రాజెక్టుతో సంబంధం లేకుండా 80 శాతం పంటలు పండుతున్నాయన్నారు. ఎన్నికల ముందు తాము ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. గతంలో చెన్నూరు బీఆర్ఎస్ పార్టీ ఆగడాలు మితిమీరిపోయిన సంగతి ప్రజలందరికీ తెలుసన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

### మంత్రికి సన్మానం

పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం మంత్రి వివేక్‌వెంకటస్వామిని నూరు బాష సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. మంత్రి మాట్లాడుతూ ముస్లింమైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, అర్హులైన వారు పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సలావుద్దీన్, షరీఫ్, సుకుర్, జమీల్, ఇసాక్, చోటమియా, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జీపీ నిధుల నిర్వహణపై తనిఖీలు

దండేపల్లి సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 2024-25 సంవత్సరంలో గ్రామ పంచాయతీలకు వచ్చిన నిధులు, వాటి ఖర్చులపై జిల్లా ఆడిటింగ్ బృంద సభ్యులు తనిఖీలు చేపట్టారు. మండలంలోని కొత్త మామిడిపల్లి, పాత మామిడిపల్లి, తానిమడుగు, తాళ్లపేట, దండేపల్లి గ్రామ పంచాయతీలకు సంబంధించిన సాధారణ నిధులు, ఎస్ఎఫ్‌సీ, సీఎఫ్‌సీ నిధుల విడుదల ఖర్చులపై ఆడిట్ సభ్యులు తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీవో విజయప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు శ్రీలతరెడ్డి, సత్తయ్య, కోటేష్, ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


చిమ్మ చీకట్లో.. బతుకమ్మ ఆటలు

7


## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### కలెక్టర్ కుమార్ దీపక్

లక్షెట్టిపేట, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ వైద్య సిబ్బందికి సూచించారు. పట్టణంలోని 30పడకల ఆసుపత్రిని కలెక్టర్ స్థానిక తహసీల్దార్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యరంగాన్ని బలోపేతం చేస్తు ప్రజా సంక్షేమమే దిశగా చర్యలు చేపడుతోందన్నారు. ప్రజల సౌకర్యార్థం అవసరమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసర మైన మేరకు వైద్యులను, సిబ్బందిని, మందులను కూడా అందుబాటులో ఉంచామన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకునే జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా ఆసుపత్రిలోని పలు రికార్డులతో పాటు ల్యాబ్, ఫార్మసీ, వార్డులను పరిశీలించారు. మార్చురీ, క్యాంటిన్ నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదే విధంగా పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల గదుల నిర్మాణం పనులు పరిశీలించారు. పాఠశాల పునఃప్రారంభం వరకు పనులు జరిగే విధంగా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో తిరుగుతూ పారిశుధ్య పనులను పరిశీలించారు. అమృత్2.0 పథకంలో నీటి ట్యాంకుల ద్వారా ప్రజలక నిరంతరం తాగునీరు అందిం చేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డీసీ హెచ్ఎస్ డాక్టర్ కోటేశ్వర్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆకుల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ విజయ్‌కుమార్, వైద్యులు స్రవంతి, సురేష్, కృష్ణ ఉన్నారు.



ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

# సింగరేణి గ్రాస్ ప్రాఫిట్‌లో కార్మికుల వాటా ఇవ్వాలి

- లాభాల వాటా సీఎం భిక్షం వేసినట్లు ప్రకటించిండు
- సమయం, అవసరాన్నిబట్టి జాగృతిని రాజకీయ పార్టీగా ప్రకటిస్తాం
- శ్రీరాంపూర్‌లో జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత



డప్పు కళాకారులతో కలిసి నృత్యం చేస్తున్న కవిత

మంచిర్యాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి లాభాల వాటాను కార్మికులకు మొత్తం గ్రాస్ ప్రాఫిట్‌పై ఇవ్వాల్సిందని, సం స్థకు వచ్చిన లాభాల్లో కార్మికుల వాటా ముందుగా పక్కకు పెట్టి తరు వాత అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించాల్సిందని ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆనాటి ఆంధ్ర వలస పాలనలో మన యువతకు ఉద్యోగాలు అంటే కేవలం బొగ్గు బాయిలే ఉండేవని, ఇక్కడి ప్రజలకు బతుకుదెరువును చూపిన సిరులవేణి సింగరేణికి ప్రభుత్వం దాదాపు రూ. 42వేల కోట్లు బకాయిలు పెట్టి ఎలా దివాలా తీయిస్తుందో కార్మికులు అర్థం చేసుకోవాలని కవిత అన్నారు. శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో మంగళవారం సాయంత్రం జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన బతుకమ్మ సంబరాల్లో పాల్గొనేందుకు కవిత శ్రీరాంపూర్‌కు వచ్చారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ఉన్నప్పుడు తాము లాభాల వాటాను కార్మికులకు మొత్తం గ్రాస్ ప్రాఫిట్‌పై చెల్లించామని, టోటల్ లాభాల్లో వాటా ఇచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రెండేళ్లుగా 70 శాతం అభివృద్ధి పేరిట నిధులు పక్కన పెట్టి, ఆ తరువాత 34 శాతం లాభాల వాటా అని చెబుతున్నారని, దీనివల్ల కార్మికులకు నష్టం జరుగుతుం దన్నారు. ప్రభుత్వ చర్యల వల్ల ఒక్కో కుటుం బానికి లక్షా 50 వేలు తగ్గాయన్నారు. లెక్కల గారడి చేసి కార్మి కులను మోసం చేస్తామంటే నడవదని, ఇంటికి లక్ష రూపాయలు ముఖ్యమంత్రి లాస్ చేసాడని ఎద్దేవా చేశారు. లాభాల్లో వాటా కార్మికులకు భిక్షం వేసినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారని, అది కరెక్టు కాదన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం ఉండకూడదని అన్నారు. సంస్థలో రాజకీయ జోక్యాన్ని సహించేదిలేదన్నారు. ముందుగా కాంగ్రెస్ నేతలు అవినీతిని తగ్గించుకోవాలన్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో కాంగ్రెస్ వాళ్ల మొత్తం గూండాయిజమే చేస్తున్నారని ఆరోపించారు.

సింగరేణి జాగృతి భవిష్యత్తులో రాజకీయ పార్టీగా అవతరిస్తదా..? అన్న విలేక రుల ప్రశ్నకు సమాధానమిస్తూ భవిష్యత్తులో జాగృతి ఏం చేస్తుందన్నది సింగరేణి కార్మికులే నిర్ణయించాలన్నారు. సింగరేణి జాగృతి అధ్యక్షురాలిగా కొత్త గనులు రావడానికి ఏం చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించగా, కేసీఆర్ సంవత్సరానికి ఐదు గనులు ఓపెన్ చేయ వచ్చనే సమగ్ర రిపోర్టు తయారు చేయించారన్నారు. దాన్ని కార్యరూపంలోకి తేవాల్సిన అవసరం ఉందన్నా రు. ఇటీ వల సీఎండీని కలిసి కొత్త గనుల ఏర్పాటుపై చర్చించామని, అందు కోసం హెచ్ఎంఎస్, సింగరేణి జాగృతి కలిసి పోరాటం చేస్తాయని స్పష్టం చేశారు.

### బతుకమ్మ పేర్చి... పాట పాడి

**శ్రీరాంపూర్:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శ్రీరాంపూర్ ఏరియాలో మంగళవారం పర్యటించారు. ఆమె కార్మిక కుటుంబాల ఇళ్లకు వెళ్లి బతుకమ్మలు పేర్చారు. బతుకమ్మ పాటలు పాడారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. కవిత ముందుగా సీసీసీ టౌన్‌షిప్‌లోని హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు వి. అనిల్‌రెడ్డి ఇంటికి చేరుకున్నారు. ఇంటి వద్ద ఏర్పాటు చేసిన స్టేజీపై వారి కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ పేర్చారు. అనంతరం హెచ్ఎంఎస్ సింగరేణి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు తిప్పారపు సారయ్య ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను కలిశారు. శ్రీరాంపూర్‌లోని శ్రీనివాసాచారి రెండేళ్ల క్రితం ప్రమాదంలో గాయపడగా, ఆయనను పరామర్శించి పెన్షన్ వచ్చే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆర్‌కే 8 కాలనీలోని తెలంగాణ జాగృతి కార్యకర్త గుంపుల వినయ్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

సింగరేణి ప్రాంత యువతకు ఉద్యోగాలు కావాలంటే నూతన గనులు రావాల్సిన అవసరం ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీరాంపూర్‌లో ఇప్పటికే రెండు గనులు మూతపడ్డాయని, మరిన్ని మూసే అవకాశం ఉందన్నారు. హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ, ఆడబిడ్డను ఏకాకినే చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బతుకమ్మను విశ్వ వ్యాప్తం చేసిన ఘనత కవితకు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ సింగరేణి విభాగం అధ్యక్షుడు తిప్పారపు సారయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు వి. అనిల్ రెడ్డి, ఏరియా కార్యదర్శి అశోక్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.









## ప్రేమ జంటపై దాడి

మంచిర్యాల క్రైం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం కాలేజీ రోడ్డులో ప్రేమ జంటపై దాడి చేసి వరుడి కుటుంబసభ్యులు అతడిని కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. పూర్తి వివరాల ప్రకారం బెల్లం పల్లికి చెందిన మాన్విత రాకేష్‌లు 20 రోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. కాలేజీ రోడ్డులో ఉంటుండగా రాకేష్ తల్లిదండ్రులు మాన్వితపై దాడి చేసి రాకేష్‌ను కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని, తమకు న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దాడికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఇది కాస్త చర్చనీ యాంశంగా మారింది.

## ఎస్‌బీఐ జనరేటర్‌లో చెలరేగిన మంటలు

జైపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకులోని జనరేటర్‌లో మంగళవారం ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. బ్యాంకు పనివేళలు కావడంతో పక్క గదిలో ఉన్న ఖాతాదారులు ఆందోళనకు గురయ్యారు. బ్యాంకు సిబ్బంది ఎస్టీపీపీకి చెందిన అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని బ్యాంకు సిబ్బంది తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలి

కాగజ్‌నగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు రాష్ట్రంలోని అన్ని జూనియర్ కళాశాలల్లో 12 సంవత్సరాలుగా పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కాగజ్‌నగర్‌లో గెస్ట్ లెక్చరర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కేవలం 398 మంది గెస్ట్ లెక్చరర్లకు మాత్రమే అనుమతి ఇచ్చారన్నారు. మిగిలిన వారికి కూడా అనుమతి ఇవ్వాలని బోర్డ్ సెక్రెటరీకి పంపినా అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. గెస్ట్ లెక్చరర్లకు న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్లు పాల్గొన్నారు.

# పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు



- జిల్లాలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- ప్రధాన రహదారులపైనే అమ్మకాలు
- ప్రమాదాలు పెరిగే అవకాశాలు
- అయినా పట్టించుకోని అధికారులు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కుమురం భీం జిల్లాలో బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఇన్నాళ్లు గల్లీ, వార్డుల్లో గుట్టుగా సాగే ఈ దందా ఇప్పుడే ఏకంగా ప్రధాన రోడ్లపై అమ్మ కాలు పెట్టేస్తున్నారు. రాత్రి వేళల్లో మద్యం తాగే ప్రియులు ఈ దుకాణాల వద్దకు వచ్చి తాగేస్తున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా అడ్డగోలుగా మద్యం విక్రయాలను జరుపుతున్నారు. జిల్లాలో మొత్తం అధికారికంగా 32 వైన్‌షాపులకు అనుమతి ఉండగా, అక్రమంగా 1200 లకు పైగానే బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నారు. నాటు సారా, దేశీదార్ అమ్మకాలపై ఉక్కుపాదం మోపుతున్న అధికారులు బెల్ట్‌షాపులపై కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదు. మున్సిపల్ పరిధిలో గల్లిగల్లీకి బెల్ట్ షాపులే కన్పిస్తున్నాయి.

అలాగే ఆసిఫాబాద్, సిర్పూరు నియోజక వర్గాల్లోని వివిధ గ్రామాల్లో కూడా ఇళ్లలోనే దుకాణాలను పెట్టేశారు. బెల్ట్‌షాపులో ఎక్కువ ధరకు మద్యం అమ్ముతున్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు మద్యానికి బానిసలై తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నారు. వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేక ప్రాణాలు కూడా పోతున్నాయి. కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్డు నుంచి బెజ్జూరు వరకు గల ప్రధాన రోడ్డుపైనే బెల్ట్ షాపులు వెలిశాయి. ప్రధాన రోడ్డుపైనే దుకాణాల్లో మద్యం లభిస్తుండటంతో పలువురు వాహన చోదకులు తమ వాహనాలను రోడ్డుపై ఆపేసి తాగేస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపరాదని అధికారులు పదేపదే హెచ్చరికలు జారీ చేస్తున్నా ఇవీ అమలు కావటం లేదు.

జిల్లాలో పోలీసులు బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ ఇంకా అదుపులోకి రావటం లేదు. బెల్ట్ షాపులకు ఆయా లైసెన్స్ దుకాణాల నుంచి మద్యం సరఫరా చేసి ఇక్కడ అమ్మకాలు చేస్తున్నారు. ప్రభుత్వం విధించిన టార్గెన్‌ను చేరుకోవాలంటే ఈ దందానే శరణ్యమని పలువురు పేర్కొన్నారు. తమ టార్గెట్ చేరు కోవా లంటే తప్పకుండా బెల్ట్ దుకాణాలకు సరఫరా చేయాల్సిందేనని కొంత మంది బాహాటంగా చెబుతున్నారు.



కాగజ్‌నగర్ ప్రధాన రోడ్డుపై ఏర్పాటు చేసి బెల్ట్ షాపు

### ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా..

కాగజ్‌నగర్ చింతగూడ కోయవాగులో విచ్చలవిడిగా మద్యం బెల్ట్ షాపులు అమ్మకాలు చేస్తున్నారని మహిళలు, గ్రామస్థులు పది నెలల క్రితం కాగజ్‌నగర్ ఎక్సైజ్ కార్యాలయం శాఖ ఎదుట ధర్నా చేశారు. దీంతో అధికారులు వెంటనే తేరుకొని గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహించవద్దని తేల్చిచెప్పారు. వరుస దాడులు కూడా నిర్వహించారు. సిర్పూరు మండలంలోని కౌటాల, బెజ్జూరు, దహెగాం, చింతలమానేపల్లి, కాగజ్‌నగర్‌లో బెల్ట్‌షాపులు అధికంగా ఉన్నాయి.

24 గంటల పాటు మద్యం అమ్మకాలు మద్యం ప్రియులు ఈ బెల్ట్ షాపులపైనే తాగేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పత్రికల్లో వచ్చిన కథనాలతో అధికారులు అడ పాదడపా దాడులు చేస్తున్నారే తప్పా వీటిని పూర్తిగా మూసివేసేందుకు అడుగులు వేయటం లేదని ఆయా గ్రామాల మహిళలు వాపోతున్నారు. లైసెన్స్ షాపుల వారి టార్గెట్ కోసం ఇలా బెల్ట్ షాపులను ప్రోత్సాహించటం ఈ ప్రాంతంలో పరిపాటి అయింది. వారం రోజుల క్రితం కూడా కాగజ్ నగర్ మండలం ఈసుగాంలో కూడా బెల్ట్‌షాపు వద్ద గొడవ జరిగింది. ఇలా గ్రామాల్లో నిత్యం ఈ దందాతో గొడవలు జరుగుతున్నాయని, వీటిని తక్షణమే మూసివేసేట్టు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## గంజాయి మొక్కలు సాగు చేసిన వ్యక్తిపై కేసు నమోదు



గంజాయి మొక్కలను పరిశీలిస్తున్న ఎస్సై మధుకర్

కెరమెరి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలం ఇందాపూర్ గ్రామ శివారులో వడై పోశెట్టి అనే వ్యక్తి తన పత్తి చేనులో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు ఎస్సై మధుకర్ గుర్తించారు. ఈ మేరకు మంగళవారం తనిఖీ చేయగా 130 గంజాయి మొక్కలు ఉన్నట్లు గుర్తించి పోశెట్టిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## బ్లాక్‌మెయిల్‌కు పాల్పడిన యువకుడిపై కేసు

మంచిర్యాల క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా రామకృ ష్ణాపూర్‌కు చెందిన ఓ యువతిని అదే ప్రాంతానికి చెందిన యువకుడు వేధింపులకు గురి చేస్తూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు షీటీం మహిళా ఎస్సై హైమ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం రామకృష్ణాపూర్‌కు చెందిన యువతితో అదే ప్రాంతానికి చెందిన యువకుడికి పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నానంటూ యువకుడు యువతి వెంట పడి నమ్మించి ఇద్దరూ కొద్ది రోజుల పాటు ప్రేమలో ఉన్నారు. కొద్ది రోజుల తర్వాత అతని ప్రవర్తన నచ్చకపోవడంతో యువతి దూరంగా పెట్టింది.

కానీ యువకుడు తననే పెళ్లి చేసుకోవాలంటూ బ్లాక్ మెయిల్ చేస్తూ గతంలో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో పెడుతానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితురాలు మంచిర్యాల షీటీంను ఆశ్రయించడంతో నింది తుడిని, అతని కుటుంబ సభ్యులను పిలిపించి వారి సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి అతని వద్ద ఉన్న ఫొటోలను తొలగించారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే షీటీం వాట్సప్ నంబర్ 6303923700 లేదా 100కు సమాచారం అందించాలని తెలిపారు.

## పది లీటర్ల నాటు సారా పట్టివేత

చింతలమానేపల్లి, సెప్టెంబ రు 23 (ఆంధ్రజ్యోతి): చింతల మానేపల్లి మండలం బాబాపూ ర్ గ్రామానికి మంగళవారం నాటు సారా రవాణా చేస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా పది లీటర్ల నాటు సారా పట్టుబడిన నట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపా రు. జాజులగూడ గ్రామానికి చెందిన మొర్లె గురుమూర్తిపై కేసు నమోదు చేసి ద్విచక్ర వా హనాన్ని స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. ఈ దాడిలో ఎస్సై లోభానంద్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయం చేయాలని వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన

మంచిర్యాల క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తమను మోసం చేసి కోట్ల రూపాయల విలువచేసే భూమిని బంధువులు కాజేశారని తమకు న్యాయం చేయాలని మంచిర్యాల పట్టణంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి బాధితులు మంగళవారం నిరసన చేపట్టారు. బాధితులు మహేష్ ఆయన భార్య కీర్తన తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల పట్టణం మేదరివాడకు చెందిన బొలిశెట్టి మల్లక్కకు ఇద్దరు కుమారులు మహేష్, రాజేష్ ఉన్నారు. మహేష్‌కు వివాహం జరిగి వేరుగా ఉంటున్నాడు. మల్లక్కకు మాటలు రాకపోవడంతో పాటు చిన్న కొడుకు రాజేష్ మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో తల్లీకొడుకు కలిసే ఉంటున్నారు. రాజేష్ పేరు మీద హాజీపూర్ మండలం దొనబండ శివారులో నాలుగు ఎకరాల 17 గుంటల వ్యవసాయ భూమిని సమీప బంధువులు బొలిశెట్టి సావిత్రి, ముదం శ్రీలత సుమారు ఏడాది క్రితం అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తన తల్లి, సోదరుడి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అక్రమంగా భూమిని కాజేసిన వారిపై చర్యలు తీసుకుని మల్లక్క, రాజేష్ పేర్లమీద ఉన్న భూమి వారికే చెందేలా చేయాలని కోరుతూ మహేష్‌తో పాటు ఆయనభార్య, కొడుకుతో పట్టణంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఎట్టకేలకు ట్యాంకు దిగి వచ్చారు.

# జోరుగా నిషేధిత పటిక, నల్ల బెల్లం విక్రయాలు?

- పట్టించుకోని సంబంధిత అధికారులు

దండేపల్లి సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిషేధిత పటిక బెల్లం విక్రయాలకు మ్యాదరిపేట అడ్డగా మారినా నిరోధించాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వారి వ్యాపారం జోరుగా సాగుతోంది. దండేపల్లి మండలం మ్యాదరిపేట ప్రధాన సెంటర్‌లో పలు కిరాణ దుకాణాల్లో పటిక నల్లబెల్లం అమ్మకాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. నాటుసారా కాసేందుకు అవసరమైన ముడిసరుకు నల్లబెల్లం, పటిక ప్రతీనిత్యం జిల్లా కేంద్రం నుంచి అర్ధరాత్రి సమయంలో మ్యాదరిపేట, ఇతర ప్రాంతాలకు రవాణా అవుతోంది. దసరా పండగ వచ్చిందంటే చాలు నాటుసారా కాసే ముడిసరుకు లక్షల్లో అమ్ముడుపోతోంది. బెల్లం పటికతో పాటు ప్రాణాంతకమైన యూరియా గుళికలతో సైతం నాటుసారా తయారు చేస్తూ సామాన్య ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మ్యాదరిపేటకు 15 గ్రామాలకు ప్రధాన అడ్డాగా మారింది. ఇక్కడి వ్యాపారస్థులు సైతం తెలివిగా తమ దుకాణాల్లో సరుకు నిల్వ చేసుకోకుండా రహస్య ప్రదేశాల్లో నల్లబెల్లం, పటికను దాస్తున్నారని సమాచారం. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేయడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. ఈనెల 16న మండలంలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు జరిపి 60 కిలోల నల్లబెల్లం, రెండు క్వింటాళ్ల 40 కిలోల పటికను పట్టుకొని కేసులు నమోదు చేశారు. అధికారుల దాడులను తెలుసుకుంటున్న కొందరు వ్యాపారులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నల్లబెల్లం, పటిక దందాకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



పట్టుబడిన నిషేధిత పటిక, నల్ల బెల్లం (ఫైల్)

## రీడింగ్ రూం ఏర్పాటు

జైనూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి తన హామీని నిలబెట్టుకున్నారు. ఇటీవల జైనూర్ పర్యటనలో భాగంగా మండలంలోని శివనూర్ గ్రామాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. గ్రామంలో నెలకొన్న సమస్యల్ని అడిగి తెలుసుకోగా, మాలీలు తమకు రీడింగ్ రూం కావాలని ఎమ్మెల్యేను కోరారు. తప్పకుండా రీడింగ్ రూం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఇటీవల ఎమ్మెల్యే డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రీడింగ్ రూం కోసం ఐదు లక్షల రూపాయలు మంజూరు చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరుకు రీడింగ్ రూం కోసం మంగళవారం సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు మడావి భీంరావ్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా శివనూర్ గ్రామస్థులు ఎమ్మెలే కోవ లక్ష్మీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాలీ సంఘం మండల అధ్యక్షుడు పెట్కూలే హసెన్, నాయకులు నూర్సింగ్ నాయక్, రాథోడ్ వసంత్ నాయక్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఉద్దవ్, బీఆర్‌ఎస్ నాయకుడు ఉత్తం బళిరాం తదితరులు పాల్గొన్నారు.



భుమి పూజ చేస్తున్న మాజీ సర్పంచ్ మడావి భీంరావ్




## మంత్రి శ్రీధర్‌బాబు చొరవ మరవలేనిది

మందమర్రిటౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లాభాల వాటా చెల్లింపులో మంత్రి శ్రీధర్‌బాబు చొరవ మరవలేనిదని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. లాభాల వాటాకు సంబంధించి ఐఎన్‌టీయూసీ సెక్రె టరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల కమిటీ సలహా మండలి చైర్మన్ బి జనక్‌ప్రసాద్ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. దీంతో ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి 34శాతం పెంచేలా చొరవ చూపారన్నారు. గత బీఆర్‌ఎస్ పాలనతో చూస్తే ఈసారి మెరుగైన లాభాలా వాటా ఇస్తున్నామన్నారు. కాంట్రాక్టు కార్మికులకు 5,500 రూపాయలు చెల్లిస్తున్నారని తెలిపారు. మరో రెండు రోజుల్లోనే ఎప్పుడు చెల్లిస్తారనే విషయాన్ని అధికారికంగా వెల్లడిస్తారన్నారు. నిరంతరం కార్మిక హక్కుల కోసం మంత్రి శ్రీధర్‌బాబు, జనక్ ప్రసాద్ విశేష కృషి చేస్తున్నారని తెలిపారు.

## లాభాల వాటాలో కార్మికులకు అన్యాయం

టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి




నల్లబ్యాడ్జీలు ధరిస్తున్న కార్మికులు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వాస్తవ లాభాల నుంచి వాటా ఇవ్వాల్సిన యాజమాన్యం తక్కువ శాతం ఇచ్చి కార్మికులకు అన్యాయం చేసిందని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి విమర్శించారు. యూనియన్ పిలుపులో భాగంగా శ్రీరాంపూర్‌లోని అన్ని గనులు, విభాగాలపై నల్లబ్యాడ్జీలతో నిరసనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కంపెనీకి వచ్చిన లాభాలు ఆరు వేల కోట్ల రూపాయలకు పైగా ఉండగా, నాలుగు వేల కోట్ల రూపాయలు పక్కన బెట్టారన్నారు. మిగిలిన డబ్బు నుంచి లాభాల వాటా చెల్లించారన్నారు. ఇది కేవలం 12.6 శాతమేనని ఆయన పేర్కొన్నారు. అయినా ప్రభుత్వం, యాజమాన్యం తాము 34 శాతం ఇచ్చినట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. వాస్తవ లాభాల నుంచి 34 శాతం లాభాలు ఇవ్వకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఆయా కార్యక్రమాల్లో ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేష్, నాయకులు బాస్కర్, ఉత్తేజ్ రెడ్డి, పొగాకు రమేష్, పానుగంటి సత్తయ్య, పెట్టం లక్ష్మణ్, వెంగళ కుమారస్వామి, అన్వేష్ రెడ్డి, బుస్సా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ ఆందోళనలతోనే లాభాల వాటా

- కార్మిక సంఘాలు, కార్మికులను అవమానించిన ప్రభుత్వం, యాజమాన్యం - ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య

శ్రీరాంపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ ఆందోళనల వల్లే లాభాల వాటా సాధించామని, అయితే గుర్తింపు సంఘమైన తమను సంప్రదించకుండా ప్రభుత్వం, యాజమాన్యం ఏకపక్షంగా లాభాల వాటాపై ప్రకటన చేయడాన్ని ఖండిస్తున్నామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి. సీతారామయ్య అన్నారు. నస్పూర్‌శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఏకపక్ష నిర్ణయంతో కార్మిక సంఘాలను, కార్మికులను అవమానించినట్లేనన్నారు. సింగరేణికి ఆరు వేల కోట్ల రూపాయలకు పైగా లాభాలు వస్తే నాలుగు వేల కోట్ల రూపాయలు పక్కన బెట్టి కేవలం 2,300 కోట్ల రూపాయల నుంచి 34శాతం వాటా ఇవ్వడం సరికాదన్నారు. ఇది కార్మికులను వంచించడమేనన్నారు. అలాగే కాంట్రాక్ట్ కార్మికులతోనే లాభాలు వస్తున్నాయని చెప్తున్న యాజమాన్యం బోనస్ రూపంలో వారికి పదివేల రూపాయలు ఇవ్వకుండా కేవలం 5,500 ఇవ్వడమేంటని ఆయన ప్రశ్నించారు. కార్మికుల పెండింగ్ సమస్యలపై ముఖ్యమంత్రికి వినతిపత్రం అందించామన్నారు. వాటి పరిష్కారానికి యాజమాన్యం ద్వారా హామీ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, ఏరియా కార్యదర్శి సుధాకర్, కాంట్రాక్ట్ కార్మిక సంఘం రీజనల్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, ట్రేడ్స్‌మెన్ ఇన్‌చార్జి సురేష్, తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

## 29న సింగరేణి ఫ్యామిలీ డే

శ్రీరాంపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 29వ తేదీన కృష్ణకాలనీలోని సింగరేణి ఫ్యామిలీ డే, బతుకమ్మ ఆట-పాట నిర్వహించనున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం(పర్సనల్) అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమానికి శ్రీరాంపూర్ ఏరియా, పరిసర ప్రాంత ఉద్యోగుల కుటుంబసభ్యులు, మహిళలు తరలిరావాలని కోరారు.

## అధికారులకు సన్మానం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30వ తేదీన ఉద్యోగ విరమణ పొందనున్న కార్పొరేట్ జీఎం (వర్క్‌షాప్స్) జేసురత్నం, కార్పొరేట్ జీఎం (ఎడ్యుకేషన్) వెంకటాచారిలను శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, ఏజీఎం(ఫైనాన్స్) బీభత్స, ఏరియా ఇంజనీర్ రమణారావు, డీజీఎంలు అనిల్‌కుమార్, రాజన్న, ఆనంద్ కుమార్, రవీందర్, మల్లయ్య, డిప్యూటీ సీఎంవో డాక్టర్ రమేష్ బాబు, క్వాలిటీ మేనేజర్ కె వెంకటేశ్వర్‌రెడ్డి, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పూలను పూజించే పండుగ బతుకమ్మ

మందమర్రిటౌన్,సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పూలను పూజించి ఆరాధించే పండుగ బతుకమ్మ అని, తెలంగాణ సంస్కృతి సంప్రదాయానికి ప్రతీక అని మందమర్రి జీఎం రాధాక్రిష్ణ అన్నారు. మంగళవారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి పేద ధనిక అని తేడా లేకుండా మహిళలందరూ ఎంతో ఉత్సాహంగా ఆడుకునే పండుగ బతుకమ్మ అని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు జరిగే వేడుకలు ఎంతో సంతోషాన్ని ఇస్తాయని తెలిపారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ బతుకమ్మ వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. సద్దుల బతుకమ్మ రోజు స్థానిక సింగరేణి పాఠశాల మైదానంలో ఉత్తమ బతుకమ్మ పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా ఫ్యామిలిడే వేడుకలు నిర్వహించారు. వీటిలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం విజయ ప్రసాద్, సేవా సమితి అధ్యక్షురాలు శివాని రాధాక్రిష్ణ, అధికారుల సంఘం అధ్యక్షులు రమేశ్, పీఎం శ్యాంసుందర్, సీనియర్ పీవో శంకర్, తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బహుమతులు అందజేస్తున్న జీఎం రాధాక్రిష్ణ దంపతులు

## కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన

శ్రీరాంపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తమకు నాలుగు నెలలుగా రావాల్సిన వేతనాలు చెల్లించాలని సీఆర్‌ఆర్ ఓబీ కాంట్రాక్ట్ కంపెనీ కార్మికులు మంళవారం ఓసీపీ ప్రధాన గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఉదయం షిఫ్ట్ సమయంలో అక్కడికి చేరుకున్న కార్మికులు పర్మనెంట్ కార్మికులు విధులకు వెళ్లకుండా అడ్డుకున్నారు. లారీలు, ఇతర వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. తాము నాలుగు నెలలుగా వేతనాలు లేకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. జీఎం, ఓసీపీ పీవో స్పందించి వేతనాలు ఇప్పించాలని కోరారు. శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## కార్పొరేట్ జీఎంకు సన్మానం

జైపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30న పదవీ విరమణ పొందుతున్న కార్పొరేట్ జీఎం (వర్క్‌షాప్, ఎనర్జీ మేనేజ్‌మెంట్) జేసురత్నంను మంగళవారం ఎస్టీపీపీఈలోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. వారు మాట్లాడుతూ జేసురత్నం జీఎం ఎనర్జీ మేనేజ్‌మెంట్‌గా సింగరేణికి, థర్మల్‌పవర్ ప్లాంటుకు ఎన్నో సేవలందించారని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు నర్సింహారావు, మురళీదర్, మదన్‌మోహన్, అజాజుల్లాఖాన్, ప్రభాకర్‌రావు, పంతుల, కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కన్నెపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్కాపూర్ గ్రామ సమీపంలోని మూల మలుపు వద్ద మంగళవారం రాత్రి ఆర్టీసీ బస్సు బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బెల్లంపల్లి మండలంలోని రాళ్లపేట గ్రామానికి చెందిన చిలుముల శ్రీదర్ బెల్లంపల్లి పట్టణంలోని ఓ ట్రాక్టర్ షోరూంలో పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా మంగళవారం భీమిని మండలానికి వెళ్లాడు. తిరిగి బెల్లంపల్లికి వస్తుండగా బెల్లంపల్లి నుంచి భీమిని వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బైక్ ఎదురెదుగా ఢీకొన్నాయి. దీంతో శ్రీధర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో బెల్లంపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టి కాహారం అందించాలని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాలోని 747 పాశాలల్లో చదువుతున్న 34,818 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కింద మెను ప్రకారం పౌష్టికాహారం అందించడంతో పాటు రోజు విడిచి రోజు కోడిగుడ్డు అందిస్తామన్నారు. 1 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు సంబంధించి మధ్యాహ్న భోజన పథకం చెల్లింపులు 2025 జులై వరకు జరిగాయని, మిగితా పెండింగ్ బిల్లులను త్వరలోనే చెల్లిస్తామన్నారు. ఈ సమావేశంలో డీఈవో యాదయ్య, డీఆర్‌డీవో కిషన్, జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం, డీఎంహెచ్‌వో అనిత, జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్, జిల్లాపౌరసర ఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లామేనేజర్ శ్రీకళ, ఎంఈవోలు పాల్గొన్నారు.

## గర్భిణులకు పౌష్టికాహారం ముఖ్యం

జైపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని మండల తహసీల్దార్ వనజారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన పోషణమాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందించే సేవల గురించి బాలింతలు, గర్భిణులకు వివరించారు. అనంతరం గర్భిణులు, బాలింతలతో పోషణ ప్రతిజ్ఞచేయించారు. వైద్యుడు అశోక్, ఎంపీడీవో శ్రీపతి బాపురావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, ఐకేపీ ఏపీఎం సం తోష్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకుమెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐబీ ప్రాంతంలో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రూ. 300 కోట్ల వ్యయంతో 650 పకడలతో చేపట్టిన సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాన్ని వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య రంగాన్ని బలోపేతం చేయడం కోసం జిల్లా కేంద్రంలో ఆసుపత్రిని నిర్మిస్తామన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయాన్ని సందర్శించి ఆర్డీవో శ్రీనివాసరావుతో కలిసి జాతీయ రహదారి 63 నిర్మాణంలో భాగంగా కొనసాగుతున్న పనుల పురోగతి వివరాలను పరిశీలించారు. పనుల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలకు తాగునీరు, ఇతర ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు



జైపూర్‌లో బతుకమ్మ సంబరాల్లో తహసీల్దార్ వనజారెడ్డి, మహిళలు

జైపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ వనజారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూలతో బతుకమ్మలను తయారు చేశారు. బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ బతుకమ్మ పండగ తెలంగాణ సంస్కృతిక వైభవానికి ప్రతీక అని తెలిపారు. పూలను పూజించడం ద్వారా ప్రకృతికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఎంపీవో శ్రీపతి బాపురావు, ఐసీడీ ఎస్ సూపర్ వైజర్ కవిత, మహిళ సంఘం అధ్యక్షురాలు మాలతి, సిబ్బంది పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఉన్న పాఠశాలను తొలగించాలి

కాసిపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాలెగూడ టీడబ్ల్యూపీఎస్ పాఠశాల పాత భవనం శిథిలావస్థలో ఉందని, దీంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని, దీన్ని వెంటనే తొలగించాలని మంగళవారం పేరెంట్స్ కమిటీ సభ్యులు మండల పరిషత్ సూపరింటెండెంట్ లక్ష్మయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిడాం గణపతి మాట్లాడుతూ పాఠశాలకు కొత్త భవనం నిర్మించి తరగతి గదులు కొనసాగుతున్నాయని, కానీ పిల్లలు ఆటలు ఆడుకుంటూ శిథిలావస్థలో ఉన్న భవనంలోకి వెళ్తున్నారన్నారు. గతంలో రెండు సార్లు గోడలు కూలిపోయాయని, ఆ సమయంలో విద్యార్థులు లేక పోవడంతో ప్రమాదం తప్పిందన్నారు. వెంటనే శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పెంద్రం ప్రభాకర్, శ్రీనివాస్, శంకర్, జైతు, రవీందర్, కిరణ్, రాంచందర్, జలపతి, సావిత్రిబాయి, రంభ, దశ్వంత్‌రావు పాల్గొన్నారు.

# చిమ్మ చీకట్లో.. బతుకమ్మ ఆటలు



చీకట్లోనే బతుకమ్మలను తీసుకువెళ్తున్న మహిళలు

### గ్రామాల్లో అలంకారప్రాయంగా హైమాస్ట్ లైట్లు

### వెలగని వీధి దీపాలు..

### అంధకారంలోనే బతుకమ్మ సంబరాలు

కాసిపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల క్రితం గ్రామాల్లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు ఇప్పుడు అలంకార ప్రాయంగా మిగిలాయి. మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో 170 హైమాస్ట్ లైట్లను ఒక్కో లైట్‌కు రూ.1.90 లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేశారు. కాని నిర్వహణ లోపం కారణంగా మూడు సంవత్సరాల్లోనే కొన్ని లైట్లు చెడిపోవడంతో వాటిని పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లోని ప్రధాన కూడళ్లతో పాటు బతుకమ్మ కేంద్రాలు, బతుకమ్మలు నీటిలో వదిలే ఘాట్‌ల వద్ద ప్రత్యేక లైట్లతో ఆకర్షణీయంగా తయారు చేసేవారు. కానీ ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదనే సాకుతో గ్రామాల్లో వీధి దీపాలు సైతం ఏర్పాటు చేయక పోవడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పల్లంగూడలో అలంకారప్రాయంగా ఉన్న హైమాస్ట్ లైట్ టవర్‌లు

#### గ్రామాల్లో రూ. 3 కోట్లతో హైమాస్ట్‌లైట్లు

మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో రూ. 3.23 కోట్లు వెచ్చించి 170 హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. కానీ నిర్వహణ లోపించడంతో మొత్తం లైట్లు ఎక్కడా వెలగడం లేదు. గ్రామాల్లో హైమాస్ట్ టవర్‌లు అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. హైమాస్ట్ టవర్‌కు 500 వాట్లు గల లైట్లను ఐదింటిని అమర్చారు. దీంతో పాటు వీధి దీపాల కరెంటు బిల్లులు సైతం పంచాయతీకి అదనపు భారంగా మారింది. వీటి మరమ్మతుల కోసం ఒక్కో లైట్‌కు రూ. 9 వేలు అవుతుంది. లైట్లను మరమ్మతులు చేసేందుకు అధికారులు సుముఖంగా లేకపోవడం గమనార్హం.

పంచాయతీ కార్యాలయం సాధారణ నిర్వహణ శానిటేషన్‌లకే డబ్బులు లేక పంచాయతీ కార్యదర్శులు అప్పుల పాలయ్యామని గగ్గోలు పెడుతున్నారు. ఈ నేప థ్యంలో హైమాస్ట్ లైట్లతో పాటు వీధి దీపాలను బిగించాలని స్థానికులు అధికారులను కోరినప్పటికీ పంచాయతీలో నిధుల లేమితో కార్యదర్శులు చేతులెత్తేస్తున్నారు. ప్రధాన రహదారులన్నీ చీకటిమయంగా మారాయి. రాకపోకలకు సైతం ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు.

#### మహిళల ఆత్మగౌరవాన్ని అవమానపరుస్తున్నారు

తెలంగాణ ఆడపడుచులకు అత్యంత ప్రధాన పండగల్లో బతుకమ్మ పండగ ప్రత్యేకమైంది. దీని నిర్వహణకు గత ప్రభుత్వం 9 రోజులు వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేసింది. కానీ ఇప్పుడు వీధి దీపాలు లేక మహిళలు చీకట్లోనే మూడు రోజులుగా బతుకమ్మ ఆడుతున్నారు. సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని మహిళలు అసహనం వ్యక్తం చేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని ప్రభుత్వం, అధికారులు కించపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లోని బతుకమ్మ గద్దెలు, ప్రధాన కూడళ్ల వద్ద లైట్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

#### వేదికల వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలి

**బి. రమణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు**



తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ పండగ బతుకమ్మ. మహిళలను గౌరవిస్తూ బతుకమ్మ గద్దెల వద్ద, రహ దారుల వెంట, వీధుల్లోలైట్లను ఏర్పాటు చేయాలి. బతుకమ్మ పండగ మొదలై మూడు రోజులు గడిచినా మహిళలు చీకట్లోనే బతుకమ్మ ఆడడం బాధాకరం. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని బతుకమ్మ ఆడే స్థలాలతో పాటు, నీళ్లలో వదిలే ఘాట్‌ల వద్ద లైట్లను ఏర్పాటు చేయాలి.

#### ఏర్పాట్లను పరిశీలిస్తున్నాం

**ఎస్‌కె సప్థర్ ఆలీ, మండల పంచాయతీ అధికారి , కాసిపేట**



బతుకమ్మ వేదికలతో పాటు పంచాయతీ కూడళ్ల వద్ద ప్రత్యేక లైట్లను ఏర్పాటు చేస్తున్నాం. అన్ని గ్రామ పంచాయతీల్లో వీధి లైట్లను ఏర్పాటు చేసేందుకు కార్యదర్శులకు సూచించాము. బతుకమ్మ పండగను మహిళలు గౌరవంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

## సోలార్ హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు కృషి



వీధి దీపాలను ప్రారంభిస్తున్న నాయకులు

భీమిని, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో సోలార్ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసేదుకు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాదం లక్ష్మీ నారాయణ అన్నారు. మంగళవారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాధవరపు నర్సింగరావుతో కలిసి మల్లీడిలో వీధి దీపాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధుల నుంచి ఒక్కో దానికి లక్ష రూపాయల వ్యయంతో ఖర్జీ భీంపూర్, లక్ష్మీపూర్, బిట్టుర్‌పల్లి, మల్లీడి, వెంకటాపూర్ భీమిని, పెద్దపేట గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున, వీగాంలో రెండు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశామన్నారు. మిగతా గ్రామాల్లో సైతం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్‌గుప్తా, కర్నె శ్రీనివాస్, జగదీష్, మల్లేష్ పాల్గొన్నారు.

## మందమర్రిలో భారీ వర్షం

మందమర్రిటౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. పోలీస్‌స్టేషన్ సమీపంలోని కోల్‌బెల్ట్ పక్కన గల నివాసాల్లోకి నీరు చేరింది. కేకే 5 గని సమీపంలోని నివాసాల్లోకి వరద నీరు చేరింది. దీంతోప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నీటిని ఎత్తి పారబోశారు. దాదాపు గంట పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎంబీటీ నుంచి మొదలుకుని కేకే 5 బంగ్లాస్ వరకు రోడ్డుపైనుంచి నీరు ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

## మున్సిపల్ ఎన్నికలకు మరింత సమయం...!

(5వ పేజీ తరువాయి)

నియమితులైన వారు ఒక సంవత్సరం పాటు పదవులను అలంకరించారు. ఇదిలా ఉండగా లక్షెట్టిపేట మున్సిపాలిటీలో మాత్రం కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన అవిశ్వాసం వీగిపోయినందున 2020లో చైర్మన్, వైస్ చైర్మన్లుగా బాధ్యతలు స్వీకరించిన బీఆర్ఎస్ నాయకులు నల్మాసు కాంతయ్య, పోడేటి శ్రీనివాసగౌడ్ పూర్తికాలం పదవీ బాధ్యతలు నిర్వర్తించారు.

### కార్పొరేషన్ ఎన్నికలు వచ్చే ఏడాదే....!

జిల్లాలోని లక్షెట్టిపేట, చెన్నూరు, బెల్లంపల్లి, క్యాతన్ పల్లి మున్సిపాలిటీల ఎన్నికలకు ఇప్పటికే మోక్షం లభిం చాల్సి ఉండగా, పరిషత్, పంచాయతీ ఎలక్షన్ల నిర్వహణతో వాటికి ముడిపడి ఉంది. పై రెండు ఎన్నికలు నిర్వహిస్తే తప్ప మున్సిపల్ ఎలక్షన్లకు మార్గం సుగమం అయ్యే అవకాశాలు లేవు. పరిషత్, పంచాయతీ ఎన్ని కలు చెరో రెండు నెలల సమయం తీసుకున్నా....మున్సిపల్ ఎన్నికలు 2026లోనే జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఇప్పటికిప్పుడు నిర్ణయం తీసుకున్నా మూడు నెలల వ్యవధిలో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశాలు చాలా తక్కువ. ఇదిలా ఉండగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎలక్షన్లు మాత్రం వచ్చే ఏడాది చివరి వరకు వెళ్లే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలు ముగిసిన తరువాతనే కార్పొరేషన్ల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ వచ్చే అవకాశం ఉంది. మున్సిపల్ ఎన్నికలు మార్చిలోగా జరిగితే కార్పొరేషన్ ఎలక్షన్ల నిర్వహణకు ఆ తరువాత మరో రెండు మూడు నెలల సమయం పడుతుంది. అంటే ఇప్పటి నుంచి సరిగ్గా ఏడాది తరువాతనే మున్సిపల్ కార్పొరేషన్ల జరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ లెక్కన మంచిర్యాల మున్సిపాలిటీకి దాదాపు 20 నెలల పాటు పాలక వర్గం లేకుండానే పరిపాలన కొనసాగనుంది. మంచిర్యాల మున్సిపాలిటీ నగర పాలక సంస్థగా మారినందున రాష్ట్రంలోని ఇతర కార్పొరేషన్‌లతో పాటే పాలక వర్గాల ఎన్నికలు జరుగనున్నాయి.

ఈ క్రమంలో మంచిర్యాల మున్సిపల్ పాలకవర్గం ముగిసి ఎనిమిది నెలలు కావస్తుండగా, కార్పొరేషన్‌గా మారినందున పాలక వర్గం ఏర్పాటుకు మరో ఏడాది సమయం పట్టనుంది.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మందమర్రిలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి వివేక్

మందమర్రిటౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమ కాంగ్రెస్ ప్రభుత్వమేనని రాష్ట్ర గనులు, కార్మిక శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి తెలిపారు. మంగళవారం మందమర్రిలోని బీ1 క్యాంపు కార్యాలయం వద్ద పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 19 నెలల కాలంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ ఏం తోచక తమప్రభుత్వంపై తప్పుడు ఆరో పణలు చేస్తుందన్నారు. అన్ని పథకాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. గత ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం కల్యాణ లక్ష్మీ 76, షాదిముబారక్ 6 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్ కుమార్, కమిషనర్ రాజలింగు, ఆర్ఐ గణపతి తదితరులు పాల్గొన్నారు.

## నేడు వాహనాల వేలం

బెల్లంపల్లి, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఎక్సయిజ్ పరిధిలో వివిధ నేరాలతో పట్టుబడిన వాహనాలను ఈనెల 25 ఉదయం 10గంటలకు వేలం వేయనున్నట్లు ఎక్సయిజ్ సీఐ ఇంద్రప్రసాద్ తెలిపారు. ఈ వేలంలో 21 ద్విచక్రవాహనాలకు ఎక్సయిజ్ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని వేలంలో పాల్గొనేవారు వాహన విలువలో 50శాతం ముందస్తుగా చెల్లించాలని తెలిపారు. వాహనాలను పరిశీలించుటకు ఇతర సమా చారం కోసం బెల్లంపల్లి ఎక్సయిజ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## ఆర్టీసీ కానిస్టేబుళ్లకు శిక్షణ పూర్తి

హాజీపూర్,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో కానిస్టేబుల్‌గా ఎంపికైనవారికి మండలంలోని గుడిపేట 13వ బెటాలి యన్‌లో శిక్షణ తరగతులు పూర్తయ్యాయి. ఈ శిక్షణలో డ్రిల్ డిసిప్లేన్‌తో పాటు సెక్యూరిటి పరమైన అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు కమాండెంట్ రాములు తెలిపారు. 15 రోజుల శిక్షణ కాలంలో శారీరకంగా, మానసికంగా దృడంగా ఉండడంపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఈ శిక్షణ వీడ్కోలు కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ బాలయ్య, నాగేశ్వర్‌రావు, కాళీదాసు, ట్రైనింగ్ రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ భాస్కర్, ఆర్ఐలు పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

వేమనపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నీల్వాయి ఎస్సీ కాలనీలో పేకాట స్థావరంపై దాడి చేసి పేకాడుతున్న 8 మందిని పట్టుకున్నట్లు నీల్వాయి ఎస్ఐ కోటేశ్వర్ తెలిపారు. వీరి వద్ద నుంచి వెయ్యి రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరైనా పేకాట ఆడినా, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## అల్పాహారం పంపిణీ

మందమర్రిరూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చిన వారికి దుర్గాదేవి నవ రాత్రులను పురస్కరించుకుని అల్పాహారం పంపిణీ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఆర్ఐ గణపతి, డిప్యూటి తహసీల్దార్ సంతోష్, కాంగ్రెస్ నాయకులు సదుర్శన్, కమల్ మనోహర్‌రావు పాల్గొన్నారు.

## ఘన సన్మానం

జన్నారం, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హాస్టల్ గిరిజనతండా గ్రామానికి చెందిన సంతోష్ ప్రభుత్వ ఏజీపీగా ఎంపిక అవడం పట్ల తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు రాజేశ్‌నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పక్షాన పేదలకు న్యాయ సాయం అందించాలన్నారు.

## స్వచ్ఛ భారత్

చెన్నూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా మండలంలోని కిష్టంపేట గ్రామంలో మంగళవారం బీజేపీ నాయకులు స్వచ్ఛ భారత్ నిర్వహించారు. రైతు వేదిక వద్ద చెత్తా, చెదారం తొలగించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుర్ర రాజశేఖర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాల క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కొన్ని విద్యా సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా దసరా సెలవులు ప్రకటించినప్పటికి తరగతులు నడుపుతున్నాయని, ఇటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యా సంఘం నాయకులు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నాయకులు బాలాజీ, విష్ణు, రమేష్, సాయిచరణ్, పాల్గొన్నారు.

## మిస్సింగ్ కేసు ఛేదించిన పోలీసులు

హాజీపూర్,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): మంచిర్యాలకు చెందిన బొలిశెట్టి రాజేశ్ నెల హాజీపూర్ మండలంలోని నబ్బుపల్లి శివారులో గల తన వ్యవసాయ భూమికి వెళ్లి తిరిగిరాకపోవడంతో తల్లి మల్లక్క హాజీపూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న హాజీపూర్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించి మిస్సింగ్‌కు గురైన రాజేశ్‌ను మంగళవారం తన కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి

బెల్లంపల్లి, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని ఏఐసీటీయు, ఎంసీపీఐయు నాయ కులు అన్నారు. మంగళవారం పట్టణంలోని లేబర్ అసిస్టెంట్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్ర కార్మిక సం క్షేమ బోర్డును ప్రభుత్వం ప్రైవేటు ఇన్సురెన్స్ కంపెనీలకు ఇచ్చిన అనుమ తులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా లేబర్‌బోర్డు కార్మికులకు సంబంధించి ప్రమాదాలు, నార్మల్ డెత్‌లకు సంబంధించిన విచారణను ప్రయివేటు ఇన్సురెన్స్ కంపెనీలకు ఇవ్వడం వల్ల కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. అంతేగాకుండా అవినీతి జరిగే ఆస్కారం సైతం ఉందని పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం ప్రై వేటు ఇన్సురెన్స్ కంపెనీలకు ఇచ్చినటువంటి అనుమతులను రద్దు చేయా లని పాత పద్దతినే కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీటీయు రాష్ట్ర నాయకులు సబ్బని రాజేంద్ర ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్, నాయకులు రమేశ్, బాలయ్య, నవీన్, రాకేశ్‌లు పాల్గొన్నారు.




లేబర్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## యూరియా కోసం అన్నదాతల ఆందోళన

భీమారం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులు యూరియా కోసం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై మంగళవారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. మండల కేంద్రంలోని మన గ్రోమోర్‌లో యూరియా కోసం సోమవారం రైతులకు టోకెన్‌లు అందజేశారు. టోకెన్‌లు తీసుకున్న వారితో పాటు మరికొంత మంది రైతులు అక్కడకు వచ్చారు. టోకెన్‌లు ఇచ్చిన వారికి బస్తాలు ఇవ్వగా మిగితా రైతులు తమకు కూడా ఇవ్వాలని నిర్వాహకులను ప్రశ్నించారు. యూరియా అయిపోయిందని చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మిగిలిన 100 బస్తాలను కూడా రైతులకు అందించారు. మండల వ్యవసాయాధికారి అత్తె సుధాకర్ చేరుకుని రైతులు ఆందోళన చెందవద్దని రానున్న మూడు, నాలుగు రోజుల్లో అందజేస్తామని చెప్పడంతో శాంతించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ యూరియా బస్తా రూ. 268 ఉండగా, కొన్ని గ్రామాల్లో ఫెర్టిలైజర్ షాపుల యాజమానులు రూ. 500 లకు యూరియా బస్తాను బ్లాక్‌లో విక్రయిస్తున్నారని దీనిపై విచారణ చేపట్టాలని రైతులు కోరారు. ఎస్ఐ శ్వేత ఆధ్వర్యంలో యూరియా పంపిణీ కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహించారు.

### పోలీసు పహరా మధ్య పంపిణీ


నెన్నెల : మండలంలోని కుశ్నపల్లిలో మంగళవారం అధికారులు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. యూరియా కోసం రైతులు పెద్ద ఎత్తున ఎగబడ్డారు. విషయం తెలుసుకున్న నెన్నెల ఎస్ఐ ప్రసాద్ తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని పంపిణీ సజావుగా సాగే లా చూశారు. కుశ్నపల్లి డీసీఎంఎస్‌కు 260 బస్తాల యూరియా మాత్రమే వచ్చింది. రైతులు ఎక్కువగా ఉండటంతో ఒక్కొక్కరికి ఒక్కో బస్తా మాత్రమే ఇచ్చారు. బస్తాలు దొరకని రైతులు నిరాశతో వెనుదిరిగారు. పనులన్ని మానుకొని పొద్దంతా క్యూలైన్లలో నిలబడితే ఒకే ఒక్క బస్తా ఇచ్చారని, ఒక బస్తా దేనికి సరిపోతుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైన సరిపడ యూరియా అందజేయాలని కోరారు.

### క్యూ కట్టిన రైతులు..

తాండూర్ : మండలంలోని రైతులు మంగళవారం యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాండూర్‌లోని సహకార బ్యాంకు సొసైటి వద్ద, అచ్చలాపూర్‌లోని ఆగ్రోస్ దుకాణం వద్ద యూరియా పంపిణీ చేయగా రైతులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. టోకెన్‌ల కోసం క్యూలో చెప్పులు పెట్టి నిల్చున్నారు. పోలీసు బందోబస్తు మధ్య అచ్చలాపూర్‌లో 220 మంది రైతులకు టోకెన్‌లు ఇవ్వగా తాండూర్‌లో 260 మందికి వ్యవసాయాధి కారులు టోకెన్‌లు అందజేశారు. ఒక్క రైతుకు ఒక యూరియా బస్తా ఇవ్వడంతో రైతులు అసహనం వ్యక్తం చేశారు. యూరియా అందక దాదాపు 300 మంది రైతులు ఆగ్రహం వ్యక్తం చేసి ఆందోళన చేపట్టారు. ఉదయం నుంచి పడిగాపులు కాసి క్యూలో నిల్చున్నా యూరియా దొరకలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులకు సరిపడేంత యూరియా వెంటనే అందించాలని, లేకపోతే తాము పంటలు నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సీఐ దేవయ్య అక్కడకు చేరుకుని రైతులకు నచ్చజెప్పడంతో రైతులు వెళ్లిపోయారు.



అచ్చలాపూర్‌లో యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు



ఆంధ్రజ్యోతి 23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
వాంకిడి మండల ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, రైతులకు బతుకమ్మ, విజయదశమి, దీపావళి శుభాకాంక్షలు. మరియు ఆంధ్రజ్యోతి 23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.... శుభాకాంక్షలతో



ఖాజా అజీజోద్దీన్
ఎంపీడీఓ వాంకిడి

| మడావి భాస్కర్ | లక్ష్మణ్ | సతీష్ | లింగయ్య |
|---|---|---|---|
| జూనియర్ అసిస్టెంట్ | జూనియర్ అసిస్టెంట్ | టైపిస్టు | రికార్డు అసిస్టెంట్ |

కార్యదర్శులు : శివ- వాంకిడి, ధర్మయ్య - బంబార, అజార్ అలీ- బెండార, మడావి రామకృష్ణ- చిచపల్లి, కొట్రరంగే సంగీత- చౌపనగుడ, ఉష్కరి రాజేందర్- ధాబా, దాలభద్ర రమాదేవి- దొడ్డిగుడ, స్రవంతి- గోయేగాం, మడావి దినేష్‌కుమార్- ఇంధాని, సిహెచ్. శరణ్య- జైత్‌పూర్, సెండె సత్యనారాయణ- జంబుల్‌ధరి, సౌమ్య చారి- కనర్‌గాం, పెగ్యాం పోషం- ఖమన, సిహెచ్. జ్యోతి- ఖిరిడి, జాడి సుజాత- కోమటిగుడ, సోనేం- లక్ష్మీపూర్, దుర్గం స్వప్న- లెండిగుడ, మహేష్‌కుమార్- నవేధరి, వినోద్‌కుమార్- నవేగాం, శ్రీనివాస్‌రెడ్డి- నవేగుడ, పేర్లి అన్నపూర్ణ- పాటాగుడ, ఎం. నియమాలిక- పిప్పర్‌గోంది, మడావి విలాస్- సామెల, తిర్రురు వెంకటేషం- సరండి, బండారి మల్లేష్ - సర్కాతి, విద్యశ్రీ- సోనాపూర్, పి. శ్రీతేజ- తేజాపూర్, పి. నితిష్‌రావు- వెల్గి,

మండల ప్రజాపరిషత్ కార్యాలయం - వాంకిడి



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా సమైఖ్య అధ్యక్షురాలు ప్రమీల

# బాలికల అభ్యున్నతికి..

- పొదుపు సంఘాల ఏర్పాటుకు కసరత్తు
- కిశోర బాలికల వివరాల సేకరణ

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలను అన్నిరంగాల్లో ప్రోత్సహించేందుకు ప్రభు త్వం చర్యలు చేపడుతోంది. ఆర్థికంగా చేయూత నందిం చేందుకు మహిళా సంఘాల మాదిరిగా కిశోర బాలి కలకు పొదుపు సంఘాలను ప్రభుత్వం ఏర్పాటు చేయ నుంది. ప్రస్తుతం మహిళా స్వయం సహాయక సంఘా లు కొనసాగుతున్నాయి. ఇందులో 18-60 మధ్య వయ స్సు మహిళలు సభ్యులుగా ఉంటారు. అయితే 60 ఏళ్ల దాటిన వారికి వృద్ధ మహిళా సంఘాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో 15-18 ఏళ్ల వయస్సు ఉన్న కిశోర బాలికలకు ప్రత్యేక సంఘాల ఏర్పాటుకు జిల్లా అధికారులు కసరత్తు ప్రారంభించారు.

**● అధికారులు భాగస్వామ్యంతోనే...**

కిశోర బాలికల సంఘాల ఏర్పాటు జిల్లా గ్రామీణాభి వృద్ధి, జిల్లా సంక్షేమ అధికారుల భాగస్వామ్యంతోనే చేపట్టనున్నట్లు జిల్లా అధికారులు చెబుతున్నారు. కొత్త గా ఏర్పాటు చేయనున్న స్వయం సహాయక సంఘాలు కార్యాచరణ ప్రారంభమైంది. వృద్ధులు, బాలికల వివ రాలు క్షేత్రస్థాయిలో అధికారులు సేకరిస్తున్నారు. ఈ నెల 12 నుంచి గ్రామాల్లో వివరాలు సేకరణ సిబ్బంది ప్రారంభించారు. ఈనెల 30 వరకు సర్వం సిద్ధం చేయనున్నారు. ఇప్పటివరకు వృద్ధుల సంఘాలు 240, దివ్యాంగుల సంఘాలు 156, కిశోర బాలికల సంఘాలు 171 గుర్తించారు.

**● ప్రయోజనాలపై అవగాహన...**

గ్రామీణ ప్రాంతాల్లో కిశోర బాలికల అభ్యున్నతికి సంఘాలు తోడ్పాటు అందిస్తాయి. ఉన్నత చదువులు, వారి కెరీర్‌లో విజయాలు సాధించడానికి అవసరమైన వాతావర ణం నెలకొల్పడం పలు అంశాలపై వివరి స్తారు. సంఘాల ఏర్పాటుకు పూర్తిస్థాయి విధివిధానా లను రాష్ట్ర అధికారులు త్వరలోనే అందించనున్నారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో వివరాలను సేకరిస్తున్నారు. 15-18 ఏళ్ల వయస్సుగల కిశోర బాలికల వివరాలు ఆరా తీస్తున్నారు. పాఠశాల, కళాశాలలో చదువుతున్న విద్యా ర్థులు, చదువు మానేసిన బాలికల వివరాలను వీవోలు, అంగన్‌వాడీ టీచర్లు సేకరిస్తున్నారు. సంఘాల్లో చేరితే కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు.

**567 సంఘాల గుర్తింపు..**

**- దత్తరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, ఆసిఫాబాద్**



వృద్ధులు, దివ్యాంగులు, కిశోర బాలికలతో సంఘాల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటివరకు వృద్ధులు, దివ్యాంగులు, కిశోరబాలికలతో 567 సంఘాలను ఏర్పాటు చేశాం. ఈనెల 30 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. కిశోర బాలిక సంఘాల ఏర్పాటు పూర్తి విధివిధానాల ప్రకారం జరుగుతుంది. త్వరలో విధివిధానాలు రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది.

## నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన



ఆసిఫాబాద్‌లో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహబూ బాబాద్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ తెలంగాణ టీచింగ్ ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేష న్ ఆధ్వర్యంలో జీజీహెచ్ ఆసుపత్రి వద్ద మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరిం చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడు తూ వైద్య వృత్తిపై గౌరవంతో మెలగాల్సిన సమాజంలో ఇలాంటి దాడులు జరగ డం దురదృష్టకరమన్నారు. పోలీసులు నిష్పక్షపాతం గా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాల ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

## ఇన్‌చార్జి డీఐఈవోగా రాందాస్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపడుతున్న రాందాస్

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇంటర్మీడి యట్ విద్యాధికారిగా స్థానిక ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తు న్న బి రాందాస్ మంగళవారం డీఐఈవోగా అదనపు బాధ్యతలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యాభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని తెలిపారు. ఇప్పటివరకు డీఐఈ వోగా పనిచేసిన కళ్యాణి ప్రమాదంలో గాయపడి సెలవులో వెళ్లగా ఆమె స్థానంలో రాందాస్ బాధ్యతలు స్వీకరించారు.

## ఆసుపత్రి ఎదుట కార్మికుల నిరసన

సిర్పూర్(టి), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్ సోర్సింగ్ పారిశుధ్య సిబ్బం ది నాలుగైదు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వేతనాలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు మాట్లాడుతూ పండగ పూట తమ వేతనాలు ఇవ్వాల ని డిమాండ్ చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జైనూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యాధులు రాకుండా పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవడంతోపాటు వ్యక్తిగత శుభ్ర త పాటించాలని సీహెచ్‌వో రాజు సూచించా రు. మండలంలోని మారుమూల గ్రామాలైన గౌరి పవర్‌గూడ, తదితర గ్రామాల్లో మంగళ వారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వైద్య సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా సీహెచ్‌వో రాజు రోగులకు వ్యాధులపై అవగా హన కల్పించారు. వ్యాధులు రాకుండా పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత ముఖ్యమన్నారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలి తే కనీస సమాచారం చేరవేయాలని, దగ్గర ఉన్న గ్రామాలవారు వెంటనే ఆసుపత్రికి వచ్చి వైద్యం చేసుకోవాలని సూచించారు. మారు మూల గ్రామాల్లో వ్యాధులున్న ప్రాం తంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్య క్రమంలో హెచ్‌ఈవో పవార్ దిలీప్ కుమార్, ఏఎన్ఎం గోదావరి, జల్పత్ ఉన్నారు.



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

**● దంత వైద్య శిబిరం**

**పెంచికలపేట (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరో గ్య కేంద్రంలో మంగళవారం స్వస్థ్‌నారి సశక్త్ పరివార్ అభి యాన్ (ఎస్ఎన్ఎస్‌పీఏ)లో భాగంగా మంగ ళవారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. దంత సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 54 మంది రోగులను పరీక్షించి చికిత్సలు అందించారు. వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా చర్మ సంబంధిత వైద్యశిబిరం బుధవారం నిర్వహిం చనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో ప్రభుత్వ వైద్య కళాశాల డాక్టర్ స్రవంతి, మెడికల్ ఆఫీస ర్ డాక్టర్ హర్షిన్, డాక్టర్ శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం: కలెక్టర్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పొరుగు సేవల పద్ధతిన జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో ఆరు నెలలు మార్చి 31, 2026 వరకు పనిచేసేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. పబ్లిసిటీ అసిస్టెంట్ ఫొటోగ్రాఫర్, వీడియో కెమెరామెన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 26లోగా పీఆర్వో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

## బాధితురాలికి ఇందిరమ్మ ఇల్లు

జైనూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం జైనూరులో చోటు చేసుకున్న సంఘటనలో మండలంలోని దేవుగూడకు చెందిన బాధితు రాలికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిందని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి చైర్మన్ విశ్వనాథ్‌రావ్, మాజీ సర్పంచ్ సార్జా బాయి, నాయకుడు మేస్రాం అంబాజీ భూమిపూజ చేశారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ సెకండరీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలికల కబడ్డి పోటీలను చైర్మన్ విశ్వనాథ్ ప్రారం భించారు. సీనియర్ నాయకుడు మేస్రాం అంబాజీ, సీఐ వెల్పు రమేష్, మాజీ సర్పంచులు మేస్రాం గోవింద్ రావ్, సార్జబాయి, పార్టీ ఉపాధ్యక్షులు పెందుర్ ప్రకాష్, మేస్రాం దౌలత్‌రావ్, ఉయిక చందన్, పటేల్ మేస్రాం మారు, ఆత్రం గంగు, మాధవ్, గ్రామ కార్యదర్శి ప్రియాంక పాల్గొన్నారు.

## క్రీడా స్ఫూర్తిని చాటాలి



పోటీలను ప్రారంభిస్తున్న మాజీ జడ్పీటీసీ టి శ్రీరామరావు

దహెగాం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటాలని మాజీ జడ్పీటీసీ శ్రీరామ రావు సూచించారు. మంగళవారం దహెగాం మండలం ఖర్జి గ్రామం లో కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకు లు భీమన్న, మోహన్, రమేష్, సతీష్, మధుకర్, తిరుపతి పాల్గొన్నారు.

## అటవీ శాఖలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్

కెరమెరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కెరమెరి అటవీ రేంజ్ పరిధిలో ఆదివాసు లకు, బడుగు, బలహీనవర్గాల వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదివా సీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు.

మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెరమెరి ఎఫ్ఆర్వో మజీరోద్దీన్ కేవలం ఒకే సామాజిక వర్గం వారికి ఉపాధి అవకాశాలు ఇస్తున్నారని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతంలో చాలా మంది నిరుద్యోగులు ఆదివాసీ యువత ఉపాధి లేక చదువుకొని కూలి పనిచేస్తే ఖాళీగా ఉన్నారన్నారు. ఇదే ఏజెన్సీ ప్రాంతంలో అటవీ రేంజ్ కార్యాలయం లో ఉపాధి దొరుకుతుందని అనుకుం టే ఒకే సామాజిక వర్గం వారితో భర్తీ చేయడంతో ఆదివాసీ యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారన్నారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ నాయకు లు ప్రభాకర్, ఎమ్మార్పీఎస్ నాయకు లు వెంకటేష్, కొలాం సంఘం నాయకులు మారుతి, లక్ష్మణ్, బాపురావు తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

**- సీడీపీవో విజయలక్ష్మి**

పెంచికలపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు సరైన పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సీడీపీవో విజయలక్ష్మి సూచించారు. మంగళవారం చెడ్వాయి అంగన్ వాడీ కేంద్రంలో పోషణ మాసం సందర్భంగా సీమం తాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడు తూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికల్లో పౌష్టిక ఆహారం సమతుల్యత కోసం ఏటా పోషణ మాసం నిర్వహిస్తున్నా మన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవో హేమలత, సూపర్‌వైజర్ కరుణ, హసీనా తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులు త్వరగా ప్రారంభించాలి

**- మాజీ ఎమ్మెల్యే కోనప్ప వర్గీయులు**

కౌటాల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ ఎమ్మెల్సీ ఎమ్మెల్యేలు తుమ్మిడిహెట్టి వరకు వచ్చే నెల 5వ తేదీ వరకు రోడ్డు పనులు ప్రారం భించని పక్షంలో తామే పూర్తి చేస్తామని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప వర్గీయులు అన్నారు. మం గళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అధ్వాన్నమైన రోడ్డు వల్ల ఐదు గ్రామ పంచాయతీ ప్రజలు ఇబ్బందులకు గు రవుతున్నారని తెలిపా రు. బస్సు సౌకర్యాన్ని కూడా ఈ మార్గంలో కాకుండా వేర్వే మార్గానికి మళ్లించారని విమర్శించా రు. దాని వల్ల ఎవరికి లాభమో ప్రజాభిప్రాయం తీసుకోవాలని సూచించా రు. తట్టెడు మట్టి కూడా పోయలేని పరిస్థితుల్లో పాలకులు ఉన్నారని వారికి ప్రజలు త్వరలోనే గుణ పాఠం చెబుతారని తెలిపారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మాంతయ్య, నాయకుల సంతోష్, మౌనిష్, మనీష్, భీమయ్య, తిరుపతి, బాపు, రవీందర్‌గౌడ్, బాజీరావు, సంతోష్ తదితర లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప వర్గీయులు

## వేతనాలు వెంటనే విడుదల చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

చింతలమానేపల్లి, సెప్టెం బరు 23 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలు నుంచి వేతనాలు రాక అనేక ఇబ్బం దులు పడుతున్నామని వెం టనే వేతనాలు విడుదల చే యాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు ఎం పీడీవో కార్యాలయంలో మం గళవారం వినతిపత్రం అంద జేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు విలాస్, జె.విలాల్, ప్రశాంత్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

**కెరమెరి:** గ్రామ పంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ రత్నకుమా రికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో పెద్ద పండగ అయిన దసరా పండగకి సైతం వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. వెంటనే వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అనీల్, భుజంగ్‌రావు, స్వామి, సంతోష్, రాజు, విజయ్, బీంరావు, పాండు, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి 23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



వాంకిడి మండల ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, రైతులకు బతుకమ్మ, విజయదశమి, దీపావళి, మరియు ఆంధ్రజ్యోతి 23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు. శుభాకాంక్షలతో........ శుభాకాంక్షలతో...

పి. అజయ్‌కుమార్ - మాజీ జడ్పీటీసీ
బండె తుకారాం - మాజీ సర్పంచు వాంకిడి
కిరిమిల్ల వినోద్ - జాగృతి జిల్లా అధ్యక్షుడు

వాంకిడి మండల బిఆర్ఎస్, జాగృతి నాయకులు, కార్యకర్తలు

## జాతీయ ఆయుర్వేద దినోత్సవం



మందులు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో సీతారాం

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆయు ర్వేద దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో మంగళవారం ఘనంగా జరుపుకు న్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్ శివాలయం లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. 120 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంతకు ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ వో సీతారాం, వైద్యులు వినోద్, అయాష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని అభినందించిన కలెక్టర్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలం గు రుడుపేట గ్రామానికి చెందిన బూర్ల సంతోష్, కల్యాణి దంపతుల కూతురు బూర్ల అవంతి నీట్-2025లో ఆల్ ఇండియా దివ్యాంగుల కేటగిరిలో 2,671 ర్యాంకు సాధించి ఉస్మానియా మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. దీంతో విద్యార్థినిని కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా సంక్షేమాధికారి డాక్టర్ భాస్కర్ మంగళవారం అభినందించి సన్మానిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రభుత్వపరంగా సాయం అందిస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో డీపీవో మహేష్ ఉన్నారు.



విద్యార్థిని అవంతిని సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

## ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించిన మహిళలు

చింతలమానేపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్బా గ్రామ ఎక్స్ రోడ్డు వద్ద రహదారిపై డబ్బా, ధరంపల్లి గ్రామాల మహిళలు ఖాళీ బిందెలతో మంగళవారం ధర్నా చేపట్టారు. రెండు వారాలుగా మంచినీళ్లు రాకపోవడంతో ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించినట్లు తెలిపారు. మహిళల నిరసనతో ఇరువైపులా మూడు గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. అధికారులు తక్షణమే స్పందించి మంచినీరు అందేవిధంగా కృషి చేయాలని కోరారు. పంచా యతీరాజ్, పోలీసు అధికారులు మహిళలతో మాట్లాడి మంచినీరు వచ్చేవిధంగా కృషిచేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

ఆంధ్రజ్యోతి 23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
వాంకిడి మండల ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, రైతులకు బతుకమ్మ, విజయదశమి, దీపావళి శుభాకాంక్షలు. మరియు ఆంధ్రజ్యోతి 23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు..... శుభాకాంక్షలతో...



కోసయ్య
ఏపీఎం- ఐకేపీ- వాంకిడి

ఐకేపీ సిబ్బంది.
సీసీ జే. వేణుగోపాల్, జే. భీంరావు, దుర్గం శ్యాంరావు, కే. రమేష్, డి. సుదాచంద్,
ఎమ్ఎస్‌సీసీ : సునిత, కవిత, శ్రీదేవి, పోచాలు,
వాడై జోతిబా - అకౌంటెంట్
వనపర్తి భాస్కర్ - సీఓ
వి. సాయి - ఆఫీస్ బాయ్

ఇందిరాకాంత్రి పథం వాంకిడి

సదా మీ సేవలో ఆంధ్రజ్యోతి
అ చిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులు గా చేరాలనుకుంటున్నారా!
అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు.
పత్రిక పంపిణీలో మీకు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

మంచిర్యాల : 94929 68431
బెల్లంపల్లి : 77806 58811
కుమ్రంభీం ఆసిఫాబాద్ : 84639 54674
C.O : 99854 11276

ఇట్లు : బ్రాంచ్ మేనేజర్